మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 116 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం | 29.08.2025



## కొలువుదీరిన గణనాథులు

- ఘనంగా ప్రారంభమైన గణపతి నవరాత్రులు

4 లో



## దేశ భాషలందు తెలుగు లెస్ ఆ..

మన బాషాను మనమే కాపాడుకోవాలి

4 లో

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో

# 2వ స్థానంలో..

## జనగామకు ప్రశంసా పత్రం

### నిజమవుతున్న పేదల కల : కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ, మన చౌరాస్తా :** నిరుపేదలకు సొంత ఇళ్లను అందించే లక్ష్యంతో అమలు చేస్తోన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జిల్లాలో వేగవంతం గా జరిగేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేస్తున్నారని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. మొదటి విడతలో 71 శాతం, రెండో విడతలో 86 శాతం గ్రౌండింగ్ పూర్తి అయినందున ఈ నెలలో రాష్ట్ర స్థాయిలో జనగామ జిల్లా రెండో స్థానం దక్కిన నేపథ్యంలో ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రశాంస పత్రం, ల్యాప్ టాప్ ని గురువారం కలెక్టర్ తన చాంబర్‌లో పీడీ హోసింగ్ మాత్రు నాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి మన జిల్లాను రాష్ట్ర స్థాయిలో మంచి స్థానంలో నిలబెట్టేందుకు ప్రజాప్రతినిధులు, మండల స్పెషల్ అధికారులు, హోసింగ్ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓ లు, ఇంజనీరింగ్ ఎంపీవో, పంచాయతీ అధికారులు కృషి చేశారన్నారు. జిల్లా లో మొత్తం మొదటి విడతలో 716ఇల్లు మంజూరు కాగా 479 గ్రౌండింగ్ అయ్యాయాని, రెండో విడత లో 5,282 ఇల్లు మంజూరు అవ్వగా 4,341 గ్రౌండింగ్ దశలో ఉన్నాయన్నారు. ఇందులో 2,693 బెస్మెంట్ లెవల్‌లో, గోడల దశలో 432, స్లాబ్ స్థాయికి 187 దశ కి చేరుకున్నాయన్నారు. ఇందుకు గాను రూ.34.98 కోట్లు లబ్ధిదారుల ఖాతాలోకి ప్రభుత్వం జమ చేసిందన్నారు. మిగతా ఇండ్లు కూడా త్వరగా పూర్తి అయ్యేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని, ఇందుకు లబ్ధిదారులు కూడా సహకరించి జిల్లాకి మంచి పేరు రావడానికి కృషి చేయాలన్నారు.

wanted

విలేకరులు కావలెను



మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way

# ‘చేయూత’ను పక్కాగా చేపట్టాలి : పింకేష్

**జనగామ, మన చౌరాస్తా :** సమగ్ర శిక్షణ, ఆర్టిఫిషియల్ లింబ్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీ సంయుక్తంగా వికలాంగుల మదింపునకు అవసరమైన పరికరాల గుర్తింపు కార్యక్రమం గురువారం స్థానిక ప్రెస్టన్ పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. ప్రత్యేక అవసరాల గుర్తింపు ప్రక్రియ ఎలా కొనసాగుతుంది అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక అవసరాలు గల ఏ ఒక్క విద్యార్థి కూడా మిగిలిపోకుండా ఈ క్యాంపు ద్వారా ప్రతి ఒక్కరూ అర్హత కలిగినటువంటి పరికరాన్ని పొందాలని సూచించారు. కార్యక్రమం జరుగుతున్నటువంటి ప్రదేశాన్ని పర్యటించి ఇందులో పాల్గొంటున్న ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలకు వారితో వచ్చిన తల్లిదండ్రులకు అవసరమైన కనీస సౌకర్యాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో మొత్తం 150 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలు మదింపునకు హాజరుకాగా వారి నుండి స్వీకరించినటువంటి దరఖాస్తులు, ధ్రువపత్రాల కాపీలు అలింకో ప్రతినిధులు స్వీకరించి తదుపరి పై కార్యాలయానికి పంపించనున్నారు. కార్యక్రమంలో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ అనురాధ జాదవ్, స్టాఫ్ నర్స్, ప్రెస్టన్ కరెస్పాండెంట్ బక్కా ప్రవీణ్, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీనర్సమ్మ, సీఎంవో వేముల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





# సాగుకు సరిపడా యూరియా ఉంది

- రైతులు ఆందోళన చెందవద్దు
- కలెక్టర్ రిజ్వాన్ బాషా

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలో సాగు సరిపడా యూరియా ఉందని కలెక్టర్ రిజ్వాన్ బాషా తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి యూరియా సరఫరా, సాగు నీటి పైన సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ వానాకాలం సాగుకు అదనంగా 500 మెట్రిక్ టన్నుల యూరియాను ఇవ్వాలని, వ్యవసాయ మంత్రితో, కమిషనర్‌తో మాట్లాడి కోరగా.. వారు వెంటనే స్పందించి కేటాయిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. వర్ష కాలం నేపథ్యంలో చెరువులు, వాగులు కుంటలు తెగ కుండా ఇసుక సంచులు తదితర వాటిని ముందస్తుగా తెచ్చుకొని తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సాగు నీటికి సంబందించి రెగ్యులేషన్ ప్రక్రియని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ అవసరాన్ని బట్టి నీటిని వదలాలని తెలిపారు. సమీక్షలో అదనపు కలెక్టర్ బెన్షా లోమ్, ఆర్డీవో వెంకన్న, డీఏవో అంబికా సోనీ, నీటిపారుదల శాఖ ఎస్ఈ సుధీర్, నవాబ్ పేట, అశ్వరావు పల్లి, స్టేషన్‌ఘన్‌పూర్ డీఈలు సునీల్ కుమార్, రవికుమార్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



## జిల్లాకు రెస్క్యూ బోట్

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన ఎస్డీ ఆర్ఎఫ్ రెస్క్యూ బోట్ ను, ISUZE వాహనాన్ని కలెక్టర్ కార్యాలయం ఆవరణలో అగ్నిమాపక శాఖకు అప్పగించారు. కార్యక్రమంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ బెన్షా లోమ్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా ఫైర్ ఆఫీసర్ బి రేమండ్ బాబు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ బి.సాయికుమార్, లీడింగ్ ఫైర్ మాన్ ప్రభాకర్, డ్రైవర్స్ ఎస్ కే.రఫీ, జె.కోటేశ్వర బాబు, ఫైర్ మెన్స్ బి. కరుణాకర్, ఎం. కనకమల్లేశం, ఎల్. ఐలయ్య, బి. బాలకృష్ణ పాల్గొన్నారు.






# వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలించిన ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్



**ఆదిలాబాద్, మన చౌరాస్తా :** రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో వరద ప్రభావిత ప్రాంతాలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అత్యవసర సమయంలో తప్ప బయటకు రాకూడదని సూచించారు. రోడ్డు కల్వర్టుల పైనుండి ప్రవహించే సందర్భంలో వాటిని దాటకుండా ఉండాలని, వేరే మార్గాలను ఉపయోగించి పట్టణానికి చేరుకోవాలని సూచించారు. ప్రజలు దాటకుండా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. వరద ఉధృతి పూర్తి అయ్యేంత వరకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మావల సీఐ కర్ర స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.



# ఎస్సై రాజుకు సన్మానం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ముల్కనూర్ ఎస్సై ఎం.రాజును గురువారం ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు భీమిరెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు చేసే కర్తవ్యానికి ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఆయన అన్నారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ఎటువంటి భయం లేకుండా గ్రామాల్లో ఏమి జరిగినా పోలీసులకు సమాచారం ఇచ్చే విధంగా నాయకులు సహకారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకుడు రాపాక రాజిరెడ్డి, కొల్లా లక్ష్మారెడ్డి, అనిరుద్, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్ట్రికల్ టూ వీలర్ షోరూం ప్రారంభం



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో హనుమకొండ రోడ్డులో ఎలక్ట్రికల్ టూ వీలర్ షోరూంను హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో, కాలుష్య నియంత్రణలో ఎలక్ట్రికల్ వాహనాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు, మహిళలకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయం కలిగించడంలో కూడా ఇవి ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజలందరూ ఈ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అన్నవరపు కిరణ్, పెంటపూర్తి రణధీర్ రెడ్డి, దొంగల కొమురయ్య, దొంతరవేణి వెంకటేశ్వర్లు, విటోభ, బొజ్జపూరి మురళి, తమ్మల మధుకర్ శర్మ, కాసగోని భాస్కర్, నరాల రాజి రెడ్డి, సుద్దాల వనరాజు, మాజీ జెడ్పీటీసీ వంగ రవి, బొజ్జపూరి అశోక్ ముఖర్జీ, ముల్కనూర్ మాజీ సర్పంచ్ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# మృతిడి కుటుంబానికి పరామర్శ



**బచ్చనపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండలం తమ్మడపల్లి గ్రామానికి చెందిన మోత్కూరి రాములు రెండు రోజుల కింద మృతి చెందగా వారి కుటుంబాన్ని శ్రీనివాస ఫంక్షన్ హాల్ యజమాని మట్టి శ్రీనివాస్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని అందిస్తూ వారి తరఫున రూ.5 వేల నగదు, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ బీజాడి సిద్ధులు, గోలకొండ నాగరాజు, మోత్కూరి మల్లయ్య, జేరిపోతుల నరసింహులు, గోలకొండ బాబు, మోత్కూరి కొమరయ్య, మోత్కూరి రవి, మోత్కూరి ప్రభాకర్ పాల్గొన్నారు.



# అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమించాలి : సీపీఎం

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం కొమురవెల్లి మండల కమిటీ సభ్యులు తేలు ఇస్తారి పిలుపునిచ్చారు. గురువారం కొమురవెల్లి మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విద్యుత్ పోరాట మృతవీరులు విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి, రామకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరం ఆనాటి ఉమ్మడి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అవలంబించిన ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ విద్యుత్ రంగాన్ని ప్రపంచ బ్యాంకు షరతుల్లో భాగంగా విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తూ రైతాంగం పై, ప్రజల పై మోపుతున్న విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో ఉత్కృతమైన ఉద్యమాలు జరిగాయన్నారు. ప్రైవేటీకరణ ఆపివేయాలని, ప్రజలపై విద్యుత్ బారాలు వద్దే వద్దు అంటూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లాల్లో ప్రజాగ్రహాన్ని చవిచూసిన ఉద్యమం విద్యుత్ పోరాటం అన్నారు. దాదాపు రాష్ట్రవ్యాప్తంగా 100 రోజులపాటు ఈ విద్యుత్ ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమం 9 వామపక్ష, కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో జరిగిందని గుర్తు చేశారు. ఈ క్రమంలో పాలక ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పి ఆగస్టు 28న బషీర్బాగ్ వద్ద ముగ్గురును కాల్చి చంపిందని అన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు వల్లంపల్లి సాయిలు, తాడూరి మల్లేశం, శాఖ కార్యదర్శులు కర్రోళ్ల ఎల్లయ్య, కానుగుల రాజు, సున్నం యాదగిరి, ఎండి గోరెమియా, మేకల కృపాకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# రైతన్నల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

## మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్

జనగామ, మన చౌరాస్తా : దేశంలో రైతులు బాగుంటే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి చెందుతారని జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. గురువారం జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో పనిచేస్తున హామాలీలు, దాడువాయిలకు, స్వీపర్లకు మొత్తం 326 మందికి బట్టల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ జనగామ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం అందరం కలిసి పని చేయాలని కోరారు. అదేవిధంగా మార్కెట్ లో పని చేసే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తరుపున, వ్యాపారుల తరుపున అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సి.హెచ్ రాజారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర నాయకులు మోకు కనుకరెడ్డి, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి జీవన్ కుమార్, సూపర్ వైజర్ శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్లు బానోతు బన్సీ నాయక్, బొట్ల నర్సింగరావు, నీలం మోహన్, ఆర్తి అసోసియేషన్ అధ్యక్షుడు మాశెట్టి వెంకన్న, దాడివాయి సంఘం నాయకులు మధు, రాజు, హమాలీ సంఘం అధ్యక్షుడు గుండెల్లి రాజు, రైతు సంఘం నాయకులు



బీరయ్య, హామాలీ నాయకులు బుడిగే వీరస్వామి, ముమెళ్ల ఐలయ్య, రాజబోయిన యాకయ్య, ఇంగోల మల్లేష్, మెరుగు ఆంజనేయులు, ఏఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



# వైభవంగా పద్మశాలీ బోనాలు

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలో పద్మశాలి కులస్తులు బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. దశాబ్దాలుగా ప్రతి సంవత్సరం సంప్రదాయ పద్ధతిగా వినాయక చవితి పండగ తర్వాత నిర్వహించే పద్మశాలీ కులస్తులు అందరు ఇంటింటికీ బోనం ఎత్తుకుని పోచమ్మ తల్లులకు మొక్కులు సమర్పించారు. ఆనవాయితీగా వస్తున్న బోనాల పండుగను అందరు ఐక్యమత్యంగా నిర్వహించారు. కార్యక్రమంలో జనగామ పోపా కార్యదర్శి మదాసు ఎల్లయ్య, జనగామ పోపా అధికార ప్రతినిధి పిట్టల సతీష్, బూరెల వెంకటేశ్వర్లు, మాదాసు శ్రీకాంత్, లగిశెట్టి ప్రభాకర్, లోక విఠల్ ,పిట్టల రవీందర్,,మదాసు రాజు,అమంచ రమేష్, లోక సునీల్ సాగర్, చింతకింది సత్యనారాయణ, గర్దాసు సంతోష్, పిట్టల వెంకటేష్, మండల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# బోథ్ మార్కెట్ దారికి మరమ్మతులు

## సొంత నిధులతో మొరం పోయించిన ఉమేష్

**ఆదిలాబాద్, మన చౌరాస్తా :** ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలోని ప్రధాన మార్కెట్ రహదారి కల్వర్టు వద్ద బండలు తేలి ప్రమాదకరంగా మారింది. గ్రామ ప్రధాన మార్కెట్ రహదారి కావడంతో నిత్యం ఈ కల్వర్టు వద్ద గ్రామస్తులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయాన్ని సామాజిక సేవకులు చట్ల ఉమేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఉమేష్ గురువారం తన సొంత నిధులతో కల్వర్టు వద్ద రహదారిని జేసీబీతో బాగు చేయించడంతో పాటు మొరం పోయించి రహదారిపై ఏర్పడ్డ గుంతలను పూడ్చివేయించారు. చెప్పిన వెంటనే సమస్యకు పరిష్కారం చూపించిన ఆయనను గ్రామస్తులు అభినందించారు.



# గణనాథా.. మా మొర ఆలకించు..!

## జీవో 317 బాధితుల విజ్ఞప్తి

భీమదేవరపల్లి, మన చౌరాస్తా : వినాయక చవితి సందర్భంగా గురువారం వాడ వాడల గణనాథుని దర్శించుకుని జీవో 317 బాధిత ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ సమస్యలను పరిష్కరించాలని ప్రార్థించారు. మా మొర ఆలకించవా గణనాథా అంటూ లేఖలు సమర్పించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో జీవో 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ రాష్ట్ర నాయకులు కూరపాటి సత్య ప్రకాష్ రావు మాట్లాడుతూ స్థానికత ఆధారంగా బదిలీలు జరగాలని డిమాండ్ చేశారు. ఇటీవల తెలంగాణ హైకోర్టు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించబడిన ఐఏఎస్ వాణి ప్రసాద్‌ను స్థానికత ఆధారంగా తెలంగాణకు కేటాయించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన గుర్తు చేశారు. దీని ఆధారంగా జీవో 317 బాధితులందరినీ సొంత జిల్లాలకు స్థానికత ఆధారంగా బదిలీ చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.






# మట్టి గణపతిని పూజిద్దాం..

# పర్యావరణాన్ని రక్షిద్దాం

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** మండలంలోని వాణి హైస్కూల్‌లో వినాయక చవితి సందర్భంగా బుధవారం మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసి పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కరుని సుమలత చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "వినాయక చతుర్థి హిందువుల పవిత్ర పండుగ. ఈ సందర్భంలో గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి నవరాత్రులు నిష్ఠగా పూజలు చేసి నిమజ్జనం చేస్తారు. అయితే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల వాడకం వల్ల నీటి కాలుష్యం పెరిగి, జలచరాలు అంతరించిపోవడమే కాక పంటలకు నష్టం వాటిల్లుతుంది. పర్యావరణానికి హాని కలుగుతుంది. మట్టి వినాయకులను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చు. ఈ అవగాహన కల్పించడానికే మా పాఠశాలలో మట్టి వినాయకులను తయారు చేసి పంపిణీ చేశాం.." అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, బాబు, షారూక్, వినయ్, స్వాతి, శ్రీలత, మౌనిక, వాణి, భవాని పాల్గొన్నా

కొలువుదీరిన గణనాథులు



జనగామ : కురుమవాడ యువసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...



ఆదిలాబాద్ : బజారహత్నూర్ మండలంలో...



జనగామ : గుండ్లగడ్డలో మణివర్ధన్స్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో...



# దేశ భాషలందు తెలుగు లెస్ ఆ..

- మన భాషను మనమే కాపాడుకోవాలి
- నేడు తెలుగు బాషా దినోత్సవం




దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణ దేవరాయలు ఆనాడెన్నడో ప్రపంచానికి చాటి చెప్పాడు. నిజానికి తెలుగుభాష ప్రాచీనమైనదిగా, సమృద్ధమైన సాహిత్యసంపదతో ప్రపంచంలో విశిష్ట స్థానం పొందింది. "తెలుగు తెలియనివాడు తలలేని వాడితో సమానం" అనే సామెత తెలుగు మహిమను తెలియజేస్తుంది. ఈ భాషలో కవిత్వం, గద్యరచనలు, శాస్త్రగ్రంథాలు, నాటకాలు విశేషమైన స్థాయిలో వెలువడ్డాయి.ఇంకా వెలువడుతూనే ఉన్నాయి.

తల్లి లాంటి మన తెలుగు భాష గ్రాంధికమై వాడబడుతుంటే అలాంటి పరిస్థితిలో వ్యవహారిక భాష అసలైన భాష అని తెలుగు భాషకు గొడుగు పట్టిన మహానుభావులు గిడుగు. తెలుగుభాష అభివృద్ధి పథంలో గిడుగు రామ్మూర్తిపంతులు గారి పాత్ర అమోఘం. ఆయన 'వ్యావహారిక భాషోద్యమం' ద్వారా పాండిత్యభరితమైన గ్రంథాలయ భాషను ప్రజలకు అర్థమయ్యే రీతిలోకి మార్చారు. "భాష మనిషి వాడుకోవడానికే కాని బంధించడానికి కాదు" అనే మాటలతో తెలుగు గద్యరచనకు కొత్త దశ దిశ ఏర్పడింది. ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషుడు.శిష్టజన వ్యవహారికభాషను గ్రంథ రచనకు స్వీకరింపజేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చతెలుగు చిచ్చర పిడుగు మన గిడుగు. వ్యవహారిక భాష ఉద్యమం వల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు,పండితులకే పరిమితమైన సాహిత్యసృష్టి, సృజనాత్మకశక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ వీలైంది. అంతటి కృషి చేసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి జయంతిని ఆగష్టు 29న "తెలుగు భాషా దినోత్సవం"గా జరుపుకుంటున్నాము.

## ప్రస్తుతం తెలుగుభాష పరిస్థితి..

ప్రస్తుతం తెలుగుభాష పరిస్థితి మిశ్రమంగా ఉంది. ఒక వైపు తెలుగు సినీ పరిశ్రమ, టెలివిజన్, సోషల్ మీడియా ద్వారా భాష విస్తృతంగా వినియోగంలో ఉన్నా, మరో వైపు ఆంగ్ల భాష ప్రభావం పెరిగిపోతూ తెలుగు మాట్లాడే అలవాటు తగ్గుతోంది. తెలుగు మాట్లాడే వారిని చిన్నచూపు చూసే దౌర్భాగ్యం దాపురించింది. పాఠశాలల్లో తెలుగు బోధన ప్రాధాన్యం తగ్గిపోవడం, ముఖ్యంగా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో తెలుగు కేవలం బోర్డు ఎగ్జామ్స్ ఉత్తీర్ణత కోసం ఒక నెలరోజుల బోధనగా మార్చివేశారు. ఇక ఇంటర్ మీడియట్ లో అయితే చెప్పనవసరం లేదు. అసలు తెలుగునే లేకుండా చేశారు. ఎక్కడా ఉపయోగించే అవకాశం లేని సంస్కృతాన్ని రెండో భాషగా పెట్టి తెలుగును నిర్వీర్యం చేస్తున్నారు. ఈ విషయం పట్ల ప్రభుత్వం శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం సమాజం ఇంగ్లీష్‌కి అధిక ప్రాధాన్యం ఇవ్వడంవల్ల తెలుగుభాష నెమ్మదిగా వెనుకబడుతోంది. అలాగని ఇంగ్లిష్ బాగా వస్తుందా అంటే అదీ లేదు. అసలు మాతృభాష రాకుండా ఇంగ్లిష్ భాష రాదు అసలు ఏ భాషా రాదు.

## తెలుగుపై ఆంగ్ల మాధ్యమ ప్రభావం..

ప్రపంచీకరణ ప్రభావంతో ఆంగ్ల భాష ప్రాధాన్యం రోజు రోజుకి పెరుగుతోంది. ఉద్యోగాలు, ఉన్నత విద్య, సాంకేతిక రంగాల్లో ఆంగ్ల భాష ఆధిపత్యం వహిస్తోంది.దానివల్ల తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లోనే చదువుకోవాలని కోరుతున్నారు. ఫలితంగా తెలుగు మాధ్యమ పాఠశాలలసంఖ్య తగ్గి, తద్వారా తెలుగు మాట్లాడేవారు కూడా రోజువారీ సంభాషణల్లో ఆంగ్ల పదాలను కలిపి మాట్లాడటం అలవాటు చేసుకుంటున్నారు. దీని వల్ల పిల్లల్లో తెలుగు పట్ల ఆసక్తి తగ్గిపోతోంది. ఇంకా దారుణమైన విషయం ఏమిటంటే మన చుట్టూ అందరూ తెలుగు మాట్లాడేవారే ఉంటారు. మనం తెలుగు ఛానల్స్ మాత్రమే చూస్తాము. తెలుగు సినిమాలే చూస్తాం. కానీ మన పరిసరాలకు సంబంధం లేని ఆంగ్లమాధ్యమాల్లో పిల్లల్ని చేర్పిస్తాం. దీనివల్ల పిల్లల్లో సృజనాత్మకత సన్నగిల్లి దేని పట్ల ఆసక్తి లేకుండా తయారు అవుతున్నారు.

భాష అనేది కేవలం సంభాషణ సాధనం మాత్రమే కాదు, అది ఒక జాతి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబం. మన తెలుగు భాషకు విశిష్టమైన సాహిత్యం, కవిత్వం, నాటకాలు, వచన సంపద ఉన్నాయి. అయితే ప్రస్తుత తరం వాటిని చదవడం, ఆస్వాదించడం తగ్గిపోతోంది. టీవీ, సినిమాలు, సామాజిక మాధ్యమాల్లో కూడా ఆంగ్ల ప్రభావం ఎక్కువ కావడం వల్ల తెలుగు తన స్వచ్ఛతను కోల్పోతుంది.ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచవ్యాప్తంగా రెండేళ్లకు ఒక భాష చొప్పున అంతరించిపోతున్నాయి. అంటే ప్రతి వంద సంవత్సరాలకు సగం భాషలు మాయమయ్యే అవకాశం ఉంది. 2100 నాటికి భూమిపై మాట్లాడే 7,000 కంటే ఎక్కువ భాషలలో సగానికి పైగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. మన తెలుగు భాషకు ఆ పరిస్థితి రాకుండా చూసుకోవడం మన కర్తవ్యం. ఈ పరిస్థితిని మార్చడానికి తెలుగు భాష పట్ల గౌరవాన్ని పెంచాలి. పాఠశాలల్లో తెలుగు బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో తెలుగు వినియోగాన్ని ప్రోత్సహించాలి. కుటుంబాల్లో పిల్లలతో తెలుగు మాట్లాడటానికి తల్లిదండ్రులు అలవాటు చేయాలి. తెలుగు సాహిత్యం, కవిత్వం, నాటకాలపై పిల్లల్లో ఆసక్తి కలిగించాలి. భవిష్యత్ తరాలకు మన భాషను సజీవంగా ఉంచడం మనందరి బాధ్యత. ఆంగ్లం అనేది ప్రపంచాన్ని చూసే కిటికి వంటిది కాని మాతృ భాష ఇంకా గొప్పది. ఆంగ్ల మాధ్యమాన్ని నేర్చుకోవడం అవసరం కానీ తెలుగు భాషను నిర్లక్ష్యం చేయకూడదు. ఆంగ్లంతో పాటు తెలుగు భాషను సంరక్షించడం ద్వారానే మన సంస్కృతి, సంప్రదాయాలు నిలుస్తాయి.

అయితే, ప్రభుత్వాలు, సాహిత్యసంస్థలు, భాషాభిమానులు తెలుగు పరిరక్షణకు ప్రయత్నాలు చేస్తున్నారు. తెలుగు అకాడమీ, విశ్వవిద్యాలయాలు, పండితులు తెలుగు పాఠ్యాంశాలను, సాహిత్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. డిజిటల్ యుగంలో ఈపుస్తకాలు, యాప్స్, యూట్యూబ్ ద్వారా కూడా తెలుగు అభివృద్ధి చెందుతోంది. మొత్తం మీద గిడుగు పంతులు చూపిన దారిలోనే తెలుగుభాషను ఆధునిక అవసరాలకు అనుగుణంగా మార్చుకుంటూ, భవిష్యత్తు తరాలకు అందించాలి. తెలుగు మన గౌరవం,తెలుగు మన అస్తిత్వం. మాతృభాష పరిరక్షణకు పక్కనున్న కర్ణాటక, తమిళనాడు, కేరళ, తదితర రాష్ట్రాలు చేస్తున్న కృషిని చూసి నేర్చుకోవాల్సిన సమయం వచ్చింది.కాబట్టి మనం గర్వంగా మాట్లాడి, రక్షించుకోవడం ప్రతి తెలుగు వాడి కర్తవ్యం.




వ్యాసకర్త : బి.ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యాయుడు, జయశంకర్ భూపాలపల్లి , 7569975383




## దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల పట్టణంలో బుధవారం కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ పరిశీలించారు. కొత్త బస్టాండ్ ఏరియా, గాంధీ చౌరస్తా వద్ద నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆ నీటిని తీసే విధంగా చర్యలు తీసుకున్నారు. రాబోయే రెండు రోజులు వానలు ఉన్నందున ముందస్తు చర్యలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అత్యవసర సమయంలో మున్సిపల్ హెల్ప్ లైన్ నెంబర్ 9491018884 కి కాల్ చేయవలసిందిగా తెలిపారు. ఈ పర్యటనలో వార్డు ప్రజలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి : సీపీఎం



**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల పట్టణంలో వర్షంతో జలమయమైన పలు కాలనీలను సందర్శించిన సిపిఎం పట్టణ కమిటీ బృందం పరిశీలించింది. పట్టణంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు వార్డుల్లో రోడ్లన్నీ గుంతల మయంగా బురద మయంగా మారిందని వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, ముందు చూపుతో సమస్యల్ని పరిష్కరించాల్సిన కమిషనర్ నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కమిషనర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రోజున పలు కాలనీలలో సిపిఎం పట్టణ కమిటీ బృందం ప్రధానంగా అంబేద్కర్ సెంటర్, గాంధీ సెంటర్ నుండి కడవేరు వెళ్లే రోడ్డు మొత్తం నీటితో నిండిపోయిందని . ఆ వర్షపు నీటిని బయటకి దారి మళ్ళించే దాంట్లో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని అలాగే కొత్త బస్టాండు అభయాంజనేయ స్వామి టెంపుల్ గాంధీ సెంటర్ వద్ద ఉన్నటువంటి సెల్లార్ లలో మొత్తం వర్షం నీరు చేరాయని దీని ద్వారా విష జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. కేవలం మున్సిపల్ అధికారులు సిబ్బంది ఇల్లు తిరిగి ఇంటి పన్నులు వసూలు చేసే దానిలో ఉన్న శ్రద్ధ సమస్యల్ని పరిష్కరించే విషయంలో వెనుకబడిపోయారని అన్నారు. పలు వార్డులలో నీరు రోడ్లపైకి వస్తున్నాయని వీటిని వెంటనే పరిష్కరించాలని లేకుంటే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను చైతన్య పరిచి మున్సిపల్ ఆఫీస్ ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు, పట్టణ కమిటీ సభ్యులు పోలోజు శ్రీహరి, శాఖ కార్యదర్శులు ముత్యాల ప్రభాకర్, బోయిన మల్లేశం, ఎస్ డి ఇబ్రహీం, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.